సౌమ్యగిరికి సుందర రోడ్డు



- పురాతన లక్ష్మీ నర్సింహస్వామి ఆలయానికి రోడ్డు
- రూ.75 లక్షలతో నిర్మాణం
- తీరిన భక్తుల కోరిక



సౌమ్యగిరి పైకి నిర్మించిన సిమెంట్ రోడ్డు

భీమునిపట్నం : భీమిలిలోని సౌమ్యగిరి కొండపైనున్న లక్ష్మీ నర్సింహస్వామి ఆలయానికి చేరుకునేందుకు రోడ్డు కావాలని సంవత్సరాల తరబడి భక్తులు కంటున్న కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారు. ఇక్కడి ఆలయం సింహాచలం నర్సింహస్వామి ఆలయం కన్నా పురాతనమైనిదని, ఉగ్రరూపంలో ఉన్న నర్సింహ స్వామి వారు ఈ కొండపైనే ఆ రూపాన్ని వదిలి సౌమ్యరూపాన్ని పొందారని... అందుకే సౌమ్యగిరి అని పేరు వచ్చిందని పురాణాల ఆధారంగా తెలుస్తోంది. ఇంతలా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయానికి మన రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచే కాకుండా ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తుంటారు. అయితే ఇక్కడి కొండపైకి చేరుకోవాలంటే మెట్ల మార్గమే దిక్కు. దీంతో మెట్ల మార్గంలో కొండపైకి చేరుకోలేని వారు నిరాశతో కిందనే ఉండిపోతున్నారు. స్థానికులు కూడా చాలా ఏళ్లుగా పైకి వెళ్లలేకపోతున్నారు. దీంతో కొండపైకి చేరుకునేందుకు రోడ్డు నిర్మించాలని సంవత్సరాల తరబడి భక్తులు కోరుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. గత పాలకులు రోడ్డు వేయిస్తామని ప్రకటనలు చేసినా ఫలితం శూన్యం. దీంతో రోడ్డు నిర్మాణంపై భక్తులు ఆశలు వదిలేసుకున్నారు.

ఎమ్మెల్యే చొరవ, సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధతో నిధుల మంజూరు

భక్తులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కొండపైకి రోడ్డు నిర్మాణ ఆవశ్యకతను 2021లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన సీఎం రూ.75 లక్షలు మంజూరు చేశారు. దీంతో అధికారులు వెంటనే పనులు ప్రారంభించి ఏడాది వ్యవధిలోనే రోడ్డు నిర్మాణం పూర్తి చేసేశారు. 2022 ఏప్రిల్ 6న సిమెంట్ రోడ్డు ప్రారంభించారు. ఇదేకాకుండా కొండపైన కార్లు, ఇతర వాహనాలు నిలిపి ఉండచానికి విశాలమైన ప్రదేశాన్ని చదును చేయించారు. ప్రస్తుతం ప్రతీ వాహనం కొండపైకి వెళ్తుండడంతో భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి పూర్తి అవకాశం ఏర్పడింది. ఇదేకాకుండా భక్తులు సేద తీరడానికి సిమెంట్ బెంచీలు కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి సముద్రం అద్భుతంగా కనిపిస్తుండడంతో కొండపైకి చేరేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు అనేక సంవత్సరాలుగా ఉన్న సమస్య పరిష్కారమై రోడ్డు నిర్మాణం పూర్తవడంతో భక్తులంతా ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం జగన్‌కు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.



సౌమ్యగిరి పై గల పార్కింగ్ ప్రదేశం నుంచి అందంగా కనిపిస్తున్న సముద్రం

ఇది కదా అభివృద్ధి

ఎంతో సదుపాయంగా ఉంది



సౌమ్యగిరి కొండపైకి రోడ్డు లేకపోవడంతో స్వామి వారి దర్శనం చేసుకోవడానికి అవస్థలు పడేవారిమి. చాలా సార్లు దర్శనానికి వెళ్దామని అనుకున్నా పైకి నడుచుకుని వెళ్లలేకపోయేవారం. ప్రస్తుతం చక్కని రోడ్డు నిర్మించడంతో గుడికి వెళ్లడానికి ఎంతో సదుపాయంగా ఉంది.

– ముక్తామల సృతసాయి దేవి, హైదరాబాద్

గతంలో దర్శన భాగ్యం లేదు



భీమిలిలో ఉంటున్నా కొండ పైకి వెళ్లేందుకు మెట్లు ఎక్కలేక పోవడంతో స్వామి వారిని దర్శించుకునే అవకాశం చాలా మందికి లేక పోవడం బాధగా ఉండేది. ప్రత్యేక రోజుల్లో మరీ ఇబ్బందికరంగా ఉండేది. ఇక జీవితంలో కొండ పైకి వెళ్లే పరిస్థితి ఉండదని భావించిన భక్తులకు అవకాశం లభించింది.

– ఆర్.సత్యనారాయణ, భీమిలి

సీఎం జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు



సౌమ్యగిరి కొండపైకి రోడ్డు నిర్మాణం ఆవశ్యతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి వెళ్లిన వెంటనే ఆయన తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేయడం చాలా గొప్ప విషయం. గతంలో ఎవరూ ఇలా స్పందించ లేదు. మేము వేరే రాష్ట్రం నుంచి వస్తున్నాం. సీఎం జగన్ దయ వల్ల కుటుంబ సభ్యులంతా చక్కగా స్వామివారిని దర్శించుకున్నాం. అందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

– అయ్యగారి లలిత, కోర్బా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం

క్లుప్తంగా

మార్మోగిన గోవింద నామస్మరణ



శ్రీవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు, కార్తీక మాసం కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. సాయంత్రం శ్రీవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కోలాటాలు, అన్నమయ్య సంకీర్తనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

తీరంలో ఈదురు గాలులు



రుషికొండలో తీరానికి చేర్చిన బోట్లు

కొమ్మాది: తుఫాను నేపథ్యంలో సముద్ర తీర ప్రాంతాల్లో శనివారం ఈదురు గాలుల ప్రభావం అధికంగా పెరిగింది. భీమిలిపట్నం నుంచి సాగర్‌నగర్ బీచ్ వరకు తీరంలో గాలులు బలంగా వీయడంతో అప్రమత్తమైన మత్స్యకారులు తమ విలువైన పడవలు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అదే విధంగా రుషికొండ బీచ్‌లో బోటు షికారును అధికారులు నిలిపివేశారు. బోట్లను తీరానికి చేర్చారు. ఈదురు గాలుల ప్రభావంతో పర్యాటక ప్రాంతాలకు పర్యాటకుల సంఖ్య తగ్గింది.

వృద్ధాశ్రమానికి వెళ్లి పింఛన్ నగదు అందజేత



పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ దాసు జగదీష్

ఆనందపురం : వలంటీర్లు ఎల్లలు దాటి తమ సేవలను అందిస్తూ వారి సేవా నిరతిని కొనసాగిస్తున్నారు. మండలంలోని వేములవలస సచివాలయం పరిధిలో ఉన్న గుంపిన జ్ఞానేశ్వర్ రావుకు ఎటువంటి ఆసరా లేక పోవడంతో నగరంలోని పెదవాల్తేరులో ఉన్న రెడ్ క్రాస్ సొసైటీ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్నాడు. కాగా వేములవలసకు సుమారు 25 కిలో మీటర్లు దూరంలో ఉన్న ఆ వృద్ధాశ్రమానికి వలంటీర్ దాసు జగదీష్ శనివారం తన ప్రయాణ ఖర్చులతో వెళ్లి పింఛన్ మొత్తాన్ని అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కోరాడ అప్పలస్వామి నాయుడు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



పద్మనాభంలో ర్యాలీ నిర్వహిస్తున్న సంఘం ప్రతినిధులు

పద్మనాభం: బాల్య వివాహాలు చేయడం నేరమని, వాటితో అనర్థాలు ఎదురవుతాయని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ప్రభాకర్ అన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పద్మనాభంలో శనివారం గ్రామైక్య సంఘం ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ఆడ పిల్లలకు 18, మగ పిల్లలకు 21 ఏళ్లు నిండకుండా వివాహాలు చేయకూడదన్నారు. బాల్య వివాహాల వల్ల మహిళలకు రక్తహీనత వచ్చి పుట్టే బిడ్డకు ప్రాణహాని ఉంటుందన్నారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

రక్తదానంతో వేరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఆనందపురం : రక్తదానం చేస్తే ప్రమాద సమయంలో మరొకరికి ప్రాణదానం చేసినట్టవుతుందని ఎస్ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శంభుప్రసాద్ అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం రెడ్‌క్రాస్ సంస్థ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శంభు ప్రసాద్ మాట్లాడుతూ పలు ప్రమాదకర సంఘటనల్లో సకాలంలో రక్తం లభించక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని, అందరూ ముందుకొచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 116 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ మురుగుదాస్, రెడ్ క్రాస్ యూత్ కో – ఆర్డనేటర్ చైతన్య, ఎన్ఎస్ఎస్ పీవో హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



తర్లువాడలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆనందపురం : ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కంటుభుక్త రామానాయుడు కోరారు. మండలంలోని తర్లువాడ, గంభీరం పంచాయతీల్లో ప్రచార రథం ద్వారా ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై శనివారం వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం స్క్రీన్‌పై ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగాన్ని వేసి వినిపించారు. కార్యక్రమంలో ఉప్పాడ అప్పారావు, ప్రసాదరావు పట్నాయిక్, మీసాల రామునాయుడు, ఏలూరి ధర్మావతి తదితరులు పాల్గొన్నారు.

తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ గంర్రెడ్డి శ్రీనివాస్

ఆనందపురం : మండలంలోని గండిగుండం – కొత్తవలస తారు రోడ్డు నిర్మాణానికి శనివారం స్థానిక సర్పంచ్ గంర్రెడ్డి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ నుంచి రూ.10 లక్షలు, మండల పరిషత్ నుంచి రూ.6 లక్షలు, రామవరం పంచాయతీ నుంచి రూ.6 లక్షలు కేటాయించారని చెప్పారు.

దీంతో రోడ్డు సమస్య పరిష్కారం కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు గొలగాని కృష్ణ, నాయకులు కాకర్లపూడి సీతారామరాజు, బొట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం



జ్యూట్‌మిల్లు రామాలయంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

తగరపువలస: కార్తీకమాసం రెండో శనివారం సందర్భంగా చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో ప్రధాన అర్చకుడు ఆకెళ్ల రవిగణేష్ ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. విజయనగరానికి చెందిన అర్చకులు ఓరుగంటి రవిశర్మ, మండా సత్యనారాయణశర్మ, పంతుల గౌరీశంకర్ శాస్త్రోక్తంగా అమ్మవారు, మహాదేవునికి కల్యాణం జరిపించారు. భీమిలి మండలం తాటితూరుకు చెందిన పోతల సతీష్, వైష్ణవి దంపతులు ఈ కల్యాణం జరిపించారు. ఆది దంపతులకు భక్తులు కానుకలు చదివించారు. కల్యాణం అనంతరం అర్చకులు భక్తులకు ముత్యాలు కలిపిన తలంబ్రాలు పంపిణీ చేశారు. సంతపేటకు చెందిన కాకి చందు స్వామి మిత్రబృందం ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మేకల శ్రీను, వెంపడాపు రాజారావు, మల్లిబాబు, పిల్లా కనక, పిల్లా రాజేష్ తదితరులు సహాయ సహకారాలు అందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ మృతి



ఏసుబాబు (ఫైల్)

ఆనందపురం : మండలంలోని గండిగుండం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్ఐ అప్పలరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా, నిడమర్రు మండలం, తోకలపల్లి గ్రామానికి చెందిన సైదు ఏసుబాబు (26) కొబ్బరి బొండాల వ్యాపారం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం బొలేరా వాహనంతో కొబ్బరి బొండాలను విశాఖపట్నం తీసుకొచ్చాడు. అక్కడ వ్యాపారులకు కొబ్బరి బొండాలను అప్పగించి ఆనందపురం మీదుగా జాతీయ రహదారిపై వెళ్తున్నాడు. ఆ వ్యాన్ గండిగుండం వద్దకు చేరుకునే సరికి వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో వ్యాన్ బోల్తా పడగా వ్యాన్ నడుపుతున్న ఏసుబాబు రోడ్డుపై పడిపోగా అతని పై నుంచి లారీ వెళ్లిపోయింది. దీంతో ఏసుబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 పరిధిలోని 5 నుంచి 13 వరకు గల 9 వార్డుల్లో వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి తెలిపారు. ఇక్కడ వివిధ వార్డుల్లో 40 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. 10వ తరగతి పాసై అర్హులై, ఆసక్తి కలిగిన అభ్యర్థులు డిసెంబర్ 6వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 5వ వార్డులో 5, 6వ వార్డులో 5, 7లో 9, 8లో 8, 9లో 2, 10లో 2, 11లో 1, 12లో 7, 13లో 1 పోస్టు చొప్పున 40 ఖాళీలు ఉన్నాయని చెప్పారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వేపచెట్టు, రావిచెట్టుకు కల్యాణం జరిపిస్తున్న గ్రామస్తులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు గల్లీరోడ్డులో శనివారం అశ్వత్థామ ఆలయ రెండో వార్షికోత్సవం సందర్భంగా నిర్వాహకుడు సరగడ సూర్యనారాయణ, సూరమ్మ దంపతులు వేపచెట్టు, రావిచెట్టుకు కల్యాణం జరిపించారు. అర్చకుడు నేరెళ్ల విశ్వేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు చిల్లపేట, జీరుపేట గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం నుంచి ఆలయ ఆవరణలో బైటోభజన ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చిల్ల భాస్కరరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, చిల్ల సూరిబాబు, సరగడ శివాంజనేయరెడ్డి, సరగడ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీల వీసీలపై ఫిర్యాదులు తగదు

పీఎం పాలెం : రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న గవర్నర్లు, విశ్వ విద్యాలయాల ఉపకులపతులపై ఫిర్యాదులు చేస్తూ కోర్టులను ఆశ్రయించడం మంచి సంప్రదాయం కాదని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు అండ్ ఇండిపెండెంట్ డైరెక్టర్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి కేసీపీ చక్రవర్తి అన్నారు. పీఎం పాలెంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డిపై ఫిర్యాదులు చేయడం సరైన విధానం కాదన్నారు. ఏయూకు న్యాక్ ఏ ++ గ్రేడ్ ఇచ్చిన నేపథ్యంలో ఇటువంటి ఫిర్యాదులు చేయడం అనాలోచితమన్నారు. విశ్వ విద్యాలయాన్ని అభివృద్ధి చేయకుండా కౌన్సిల్ మంచి రేటింగ్ ఇస్తుందా..? అని ఆయన ప్రశ్నించారు. ఇటువంటి విమర్శలు విద్యార్థులకు, సమాజానికి మంచివి కాదని చక్రవర్తి పేర్కొన్నారు.

శరీర దానానికి 45 మంది అంగీకారం



శరీరదాన అంగీకార పత్రాలు స్వీకరిస్తున్న సీతామహాలక్ష్మి

తగరపువలస: అవయవదానం, శరీరదానంపై సంగివలస అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఇందులో 45 మంది దాతలు శరీర దానానికి అంగీకరిస్తూ డీన్ డాక్టర్ పీవీ సుధాకర్ చేతుల మీదుగా సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గూడూరు సీతామహాలక్ష్మికి అంగీకార పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవయవ, శరీర దానం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ట్రస్టీ ప్రతినిధులు నర్రా సీతామహాలక్ష్మి, జి.కన్యాకుమారి, రాజయోగ మెడిటేషన్ ఇన్‌స్ట్రక్టర్ బి.ఎస్.రామేశ్వరి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ప్రతిమాదేవి, అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ జి.వి.శివప్రసాద్, కార్యనిర్వాహక ప్రతినిధి పి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి



చంద్రనగర్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

గోపాలపట్నం: ప్రజలు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 89వ వార్డు భీమిలి నియోజకవర్గం చంద్రనగర్ 463వ నంబరు సచివాలయం పరిధిలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన స్థానిక ప్రజలతో ఆట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఆయనదేన్నారు. పేదలకు పారదర్శక సేవ చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. అందుకే గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చారన్నారు. సచివాలయం వ్యవస్థ వల్ల ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని వివరించారు. ప్రభుత్వ పథకాల కరపత్రాలను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి గోపాలకృష్ణ, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, వలంటీర్లు సచివాలయ కార్యదర్శులు, గృహ సారథులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

తగరపువలస: ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవాలు బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యతను విద్యార్థులకు వివరించారు. ప్రస్తుతం ప్రపంచంలో సాంకేతిక రంగం ముందంజలో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని సూచించారు. తక్కువ సమయంలో ఎక్కువ పని పూర్తి చేయడానికి డిజిటల్ విప్లవం కారణమన్నారు. ఇంటర్నెట్ ఉపయోగించి వివిధ అంశాల్లో సమాచారాన్ని పొందుపరచడం, సమర్థంగా ఉపయోగించడానికి కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం జరుపుకుంటారన్నారు. ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి పాల్గొన్నారు.

వరికోతలు వాయిదా వేసుకోండి

రైతులకు వ్యవసాయ శాఖ సూచన



జగన్నాథపురంలో వరి పొలాల్లో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

ఆనందపురం : తుఫాను ప్రభావం దృష్ట్యా రైతులు వరికోతలను వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. మండలంలోని చందక పంచాయతీ జగన్నాథపురంలోని వరిపొలాల్లో శనివారం జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, సిబ్బంది పర్యటించారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల మేరకు మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వరి పంటను కోస్తే నీట మునిగే ప్రమాదం ఉందన్నారు. వరి పనలు నీట మునిగితే ధాన్యం నాణ్యత కోల్పోతాయన్నారు. వారం రోజులపాటు వరి కోతలు వాయిదా వేసుకోవడం మంచిదని సూచించారు. ఇప్పటికే కోతలు కోసిన వరి పనలను కుప్పలుగా పెట్టి భద్రపరుచుకోవాలని సూచించారు. నూర్పు చేసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతంలో భద్ర పరచుకోవాలన్నారు.

వరి పంటకోత ప్రయోగం

జగన్నాథపురంలో పంట నష్టం అంచనా వేయడానికి వ్యవసాయాధికారులు పంటకోత ప్రయోగం చేశారు. బీమా కంపెనీ పరిశీలకులు, జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి నిర్దేశించిన పరిమితిలో సిబ్బంది వరిపంటను కోసి పరిమాణాన్ని అంచనా వేశారు. భవిష్యత్‌లో పంట నష్టం జరిగితే పంటకోత ప్రయోగం వివరాలు ద్వారా అంచనా వేస్తారని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు సంధ్యారత్న ప్రభ, ఏఈవో ఆర్.సింహాచలం, ఎస్.మాధురి తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

పద్మనాభం: వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం సూచించారు. వరి గింజ గట్టిపడి కోతకు సిద్ధంగా ఉన్న పంటలో కంబైన్డ్ హార్వెస్టర్‌తో పంట కోయగా వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో భద్రపరచుకోవాలని సూచించారు. తుఫాన్ తర్వాత ధాన్యాన్ని ఆరబెట్టుకునే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. వరి పంట కోసి పొలం మీద పనలు ఉంటే కట్టలుగా కట్టాలని పేర్కొన్నారు. పనలు తడిస్తే మొలకలు రాకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం



రేఖవానిపాలెంలో ప్రచారంలో సర్పంచ్ శ్రీనివాసరావు, తదితరులు

తగరపువలస: 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో భాగంగా శనివారం భీమిలి మండలం రేఖవానిపాలెంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సమ్మిడి శ్రీను, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గతంలో చంద్రబాబు పాలనతో ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనను పోలుస్తూ ఎవరి హయాంలో సంక్షేమం, అభివృద్ధి జరిగిందో వివరించారు. వచ్చే ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటు వేయాలని కోరారు. వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ కొనసాగాలంటే మళ్లీ జగన్‌నే సీఎంగా ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు మల్లేటి మహేష్ వర్మ, వలంటీర్లు పాల్గొన్నారు.